

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు వినయ్



ప్రజాశక్తి - పెద్దాపురం

యుపిలోని లక్నోలో డిసెంబర్‌లో నిర్వహించే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని ఆర్‌బి.కొత్తూరు పాఠశాల 10వ తరగతి విద్యార్థి పంపన వినయ్ ఎంపికయ్యాడని హెచ్‌ఎం సత్యవేణి తెలిపారు. ఈ నెల 25న గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలో హేమర్‌త్రో విభాగంలో జిల్లా నుంచి పాల్గొన్న విద్యార్థి ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. విద్యార్థిని పీడీ కామిరెడ్డి సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, నిత్యానందం, వెంకటరావు, జ్యోతి, గ్రామ పెద్దలు అభినందించారు.

విద్యా శాఖలో విలీనం ఎప్పుడు..?

- కనీస వేతనాలు కరువు
- అమలు కాని ఎంటిఎస్, హెచ్ఆర్ పాలసీ
- సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

విద్యా శాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వీరి బతుకుల్లో మాత్రం మార్పు కానరావడం లేదు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ కనీస వేతనాలు అందడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కుటుంబాలను పోషించుకోవాలంటే కష్టంగా మారిన నేపథ్యంలో తగిన వేతనాలను అందించాలని ఎన్నో ఏళ్లుగా వీరు ప్రభుత్వాలను కోరుతున్నప్పటికీ పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. తమను విద్యాశాఖలో విలీనం చేస్తే పలు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్న తరుణంలో ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి సమగ్ర శిక్ష సిబ్బంది సమస్యల కోసం పని చేసే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

సమగ్ర శిక్ష విభాగంలో పార్ట్ టైమ్ టీచర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, ఎంఐఎస్, సిఆర్‌పి, ఆర్ట్ టీచర్స్, క్రాఫ్ట్ టీచర్స్, అకౌంటెంట్లు, ఐఇఆర్‌టి, భవిత అయాలు, ఎంఆర్‌సి అసిస్టెంట్స్, సైట్ ఇంజనీర్లు, కెజిబివి టీచర్స్ తదితర విభాగాల్లో కాకినాడ జిల్లాలో సుమారు 1500 మంది పని చేస్తున్నారు.



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

వీరంతా తల్లికి వందనం, విద్యా కానుక, ఒఎస్‌సి చిల్డ్రన్, బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడం, గోరుముద్ద, పిల్లలపై విశ్లేషణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యా శాఖలో అన్ని రకాల ముఖ్య సమాచారం నివేదికలను అందించడంలో వీరంతా ముఖ్య భూమికను పోషిస్తున్నారు. ఎంఇఒ కార్యాలయాల్లో పాఠశాల విద్యాశాఖకు సిబ్బంది లేనందున సంబంధిత శాఖ పరిపాలనాపరమైన విధులు, భాధ్యతలు నిర్వహిస్తున్నారు. మండల విద్యాశాఖాధికారికి సబార్డినేట్స్‌గా విద్యాభివృద్ధికి సంబంధించి అన్ని రకాల భాధ్యతలు చేస్తున్నారు.

విద్యా శాఖలో విలీనం ఎప్పుడు..?

2011 నుంచి జిల్లాలో అన్ని మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల పరిధి, కార్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న వీరికి ప్రధానంగా ఉద్యోగ భద్రత కరువైంది. విద్యా శాఖలో తమను విలీనం చేయాలని అనేక ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వీరు వాపోతున్నారు. ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జెఎసి ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహించి వినతిపత్రాలు అందజేస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

పని భారం.. పెరగని వేతనాలు

ఎస్ఎస్ఎ వ్యవస్థలో 11 రకాలుగా వీరంతా పని చేస్తున్నారు. 60 శాతం నిధులు, కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. కేంద్రం నుంచి వస్తున్న 60 శాతం నిధులతోనే ఎస్ఎస్ఎను నిర్వహిస్తున్నారు. అనేకమందికి వేతనాలు పెరగడం లేదు. పని ఒత్తిడి విపరీతంగా పెరిగింది. బుక్స్‌ను స్కూల్‌కు తీసుకెళ్లే పని వీరే చేయాలి. హమాలీల మాదిరిగా పుస్తకాలను ఇతర వస్తువులను వీరితోనే చేయిస్తున్నారు. వేళా పాళా లేని పనులే కాక సాయంత్రం 5 దాటిన తర్వాత కూడా జూమ్ సమావేశాలు, ఆదివారం కూడా పని ఒత్తిడి పెరిగింది.

ప్రభుత్వ హామీ గాలికి...

2024లో 21 రోజుల సమ్మె సందర్భంగా మినిమం టైమ్ స్కెల్, హెచ్ఆర్ పాలసీను అమలు చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీని వేసి రాత పూర్వకంగా హామీలను రాసి ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఈ సమ్మె జరగ్గా అధికారంలోకి రావడం కోసం కూటమి పెద్దలు సమ్మె సందర్భంగా అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ పరిష్కారం లభించలేదు. ఒడిషా, పంజాబ్, కేరళ ప్రభుత్వాల మాదిరి ఆంధ్రాలో కూడా రెగ్యులర్ చేయాలని కోరుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పార్ట్ టైమ్ ఉద్యోగులను ఫుల్‌టైమ్‌గా మార్చి, ఇతర జిల్లాల్లో సిఆర్‌పిలను వందల కిలోమీటర్ల దూరప్రాంతాలకు బదిలీ చేయడాన్ని ఆపాలని లేని పక్షంలో విస్తత పోరాటాలకు సిద్ధపడతామని ఉద్యోగులు హెచ్చరిస్తున్నారు.



ఉద్యోగులను ఫుల్‌టైమ్‌గా మార్చాలి

పాఠశాలల్లో బోధ నేతర పనులన్నీ సమగ్ర శిక్ష ఉద్యోగులుచేతే చేయిస్తున్నారు. ఆఖరికి పుస్తకాల మూటలను సైతం ఈ కాంట్రాక్టు ఉద్యోగులతోనే చేస్తూ రోజు కూలీలుగా మర్చివేశారు. కావున ప్రభుత్వం పార్ట్ టైం ఉద్యోగులను ఫుల్ టైమ్‌గా మార్చాలి. ఇతర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి.

- మాతా చంటిబాబు, కాకినాడ సమగ్ర శిక్ష జెఎసి చైర్మన్.



ఆందోళనలు పట్టవా..?

సమస్యలపై అనేక సార్లు ఆందోళనలు చేస్తున్నాం. వినతిపత్రాలను అందజేస్తున్నాం. అయినా ప్రభుత్వం స్పందించడం లేదు. సమగ్ర శిక్ష స్కీమ్ అమలుకి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలి. కానీ కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే 60 శాతం నిధులను మాత్రమే పథకానికి ఖర్చు పెడుతోంది.

- ఎలిపే రామ్‌జీ ప్రసాద్, ఎపి సిఆర్‌పి వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యకుడు.



ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఎన్నికల ముందు జరిగిన 21 రోజుల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో అప్పటి ప్రతిపక్ష నాయకులుగా కూటమి పెద్దలు సమగ్ర శిక్ష ఉద్యోగుల శిబిరాలకు వచ్చి మద్దతు తెలిపి హామీలు ఇచ్చారు. అధికారంలోకి రాగానే అన్ని సమస్యలూ పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదు. రాష్ట్ర విద్యాశాఖలో సమగ్ర శిక్ష ఉద్యోగులను విలనం చేసి హెచ్ఆర్ పాలసీ, మినిమం టైమ్ స్కేల్ చెల్లించాలి.

- చెక్కల రాజ్‌కుమార్, జెఎసి జిల్లా గౌరవాధ్యక్షుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి కాకినాడ రూరల్

లేబర్ కోడ్స్ అమలును వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో వలసపాకల సెంటర్లో గురువారం ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల జిఒ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు కాకినాడ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జి, రూరల్ మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా మాట్లాడారు. ఏటా పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం, కార్మికుల సమస్యల ప్రస్తావన చేసే లేబర్ కాన్ఫరెన్స్ నిర్వహణ 2015 నుంచి మానేసి తన స్వభావాన్ని చూపించుకుందన్నారు. లేబర్ కోడ్లు కార్మికుల హక్కుల పాలిట ఉరితాళ్లుగా మారతాయని, నయా బానిసలుగా మారకముందే కార్మికులందరూ ఐక్యంగా బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ నాయకులు ఎవి.కృష్ణాజీ, వాసంశెట్టి చందర్రావు, పరిశ్రమ కార్మికులు బలరాం, సంగీతరావు, రాంబాబు, శ్రీను, నూకరాజు, దుర్గాప్రసాద్, విశ్వనాథ్, రామకృష్ణ, సాయి, సురేష్, కృష్ణ, శ్రీను, పి.నూకరాజు, శ్రీహరి, వెంకటేష్, ప్రసన్నకుమార్, గోవింద్, సురేంద్ర పాల్గొన్నారు.



సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేస్తున్న కార్మికులు


సామర్లకోటలో విద్యార్థుల వేషధారణలు


కరపలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన రాజ్యాంగ దినోత్సవం

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - సామర్లకోట, కరప

ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని అచ్చంపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.వేదాద్రి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అచ్చంపేటలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరవ శ్రీనివాస్, ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు. కరప జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. వ్యాసరచన, క్విజ్, వాకత్వం పోటీలను హెచ్‌ఎం రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు భోగిరెడ్డి కొండబాబు బహుమతులు సమకూర్చారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎ.సంజయ్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పల్లె పండుగ 2.0పై హర్షం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

గ్రామీణాభివృద్ధి, పంచాయితీ వ్యవస్థల పునరుజ్జీవానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె పండుగ 2.0కి శ్రీకారం చుట్టడంపై మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు. రమణయ్యపేటలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత పల్లె పండుగ కార్యక్రమంలో 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించి ప్రపంచ రికార్డు స్థాపించారన్నారు. ఉపాధి హామీ పథకం, పిఎం గ్రామీణ సడక్ యోజన, 15వ ఆర్థిక సంఘం నిధులు, పంచాయతీ సాధారణ నిధులను పల్లె పండుగ 2.0 పరిధిలోకి తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి చేయనున్నారని తెలిపారు.

మహిళా సాధికారతపై విద్యార్థుల సర్వే

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

రమణయ్యపేటలో విఎస్ఎల్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి మహిళా సాధికారతపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కెవి.రాఘవరావు మాట్లాడుతూ సమాజంలో సమాన అవకాశాలు పొందేలా వారిని ప్రోత్సహించే ఒక ప్రక్రియ మహిళా సాధికారత అన్నారు. మహిళలు సంక్షేమం, సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు పరుస్తున్నాయన్నారు. ఈ పథకాల ద్వారా మహిళలు సాధికారత సాధన విషయమై ఇంటింటి సర్వే నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారిని కె.సుకన్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

శంకర్ నేత్రాలయ సేవలను విస్తరించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల నిర్వహిస్తున్న ఉచిత కార్నియా వైద్య శిబిరాలను జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు విస్తరింప చేయాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. సామర్లకోట శ్రీ భీమేశ్వర ఆలయం వద్ద శంకర్ నేత్రాలయ కంటి వైద్యాశాల, ఎర్నేని కుటుంబం, నటరాజ నాట్యంజలి (అమెరికా) సహకారంతో డిసెంబర్ 3వ తేదీ వరకూ వారం రోజులపాటు జరగనున్న ఉచిత కంటిపొర చికిత్స శిబిరాన్ని గురువారం ఎంపీ ఉదయ శ్రీనివాస్, పెద్దాపురం ఎంఎల్‌ఎ నిమ్మకాయల రాజప్ప, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శరీర అవయవాల్లో కన్ను అతి ప్రధానమైనది కావున కంటి చూపులు కాపాడుకునే విషయంలో ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపించాలన్నారు. నిరుపేదల కోసం నేత్రాలయ కంటి వైద్యశాల, ఎర్నేని కుటుంబం, నటరాజ నాట్యాంజలి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంతో వ్యయంతో కూడినటువంటి ఈ శిబిరాన్ని పేద ప్రజల కోసం కేవలం ఉచితంగా అందించడంతోపాటు నెలరోజుల తర్వాత కూడా వారికి పరీక్షలు జరిపి, కంటి ఆరోగ్యాన్ని పరిశీలించే విలువైన సేవలు అందించడం గర్వకారణం అన్నారు. నిర్వాహకులు గడ్డమనుగు శివ, కందూరి శ్యామ్, మీసాల సునీత ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్, ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, బడుగు శ్రీకాంత్, సరోజ వాసు, అడబాల కుమారస్వామి, చీమలకొండ ప్రసాదరావు, తాతపూడి సత్య అరుణ్ వంశీ, గొల్తి సత్యనారాయణ, కంచర్ల సుష్మా మోహిని పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్, ఎంఎల్ఎ చినరాజప్ప

ఎల్ఆర్ఎస్ నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-పెద్దాపురం

పెద్దాపురం మున్సిపాలిటీకి కేటాయించిన ఎల్ఆర్ఎస్ నిధులు రూ.3 కోట్లలో రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మిగిలిన రూ.కోటితో వివిధ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. గురువారం చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ ఆరెళ్ల వీర రాఘవ మాట్లాడుతూ ప్రతి వార్డులో అనేక పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ నిధులతో అభివద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. వైసిపి కౌన్సిలర్ గోకేడ అప్పారావు మాట్లాడుతూ బంగారమ్మ గుడి వీధిలో మంచి నీటి బోరు చెడిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు కొత్త బోరు వెయ్యటం లేదన్నారు. మీరు వెయ్యకపోతే తన సొంత డబ్బుతో బోరు నిర్మిస్తానన్నారు. వెంటనే బోరు నిర్మించాలని డిమాండ్ చేస్తూ కౌన్సిల్ సమావేశంలో క్రింద కూర్చుని నిరసన తెలిపారు. వైసిపి కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ బ్యాంకు కాలనీలో భవనాల కొలతలు కొత్తగా వేసి రూ.4 వేలు ఉన్న ఇంటి పన్ను ఒకేసారి రూ.11 వేలకు పెంచటమే కాక మూడేళ్లుగా రూ.4 వేల చొప్పున మాత్రమే పన్ను వసూలు చేసినందున మిగిలిన రూ.7 వేలు కూడా చెల్లించాలనడం సమంజసంగా లేదన్నారు. వైసిపి కౌన్సిలర్ కనకదుర్గ తన వార్డు పరిధిలో డ్రైన్ నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, మేనేజర్ జ్యోతి రాణి, డిఇఇ డిఎస్.ప్రకాశరావు, ఎఇలు సుధాకర్, ఉమామహేశ్వరి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో క్రింద కూర్చున్న కౌన్సిలర్ అప్పారావు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు

పెద్దాపురం పట్టణ పరిధిలో సబ్ స్టేషన్లలో మరమ్మతులు, కొత్త లైన్ పనుల కారనంగా ఈ నెల 29వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పెద్దాపురం పట్టణ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎలక్ట్రికల్ ఇఇ ఎవిఎన్‌డిఎస్ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. దివిలి సెక్షన్‌లో 33/11 కె.వి, ఆర్.బి పట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు దీనిని గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాళ్లరేవు మండలంలోని పలు ప్రాంతాల్లో మెయింటనెన్స్ వర్క్ నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు కాకినాడ విద్యుత్ శాఖ ఇఇ ఎన్.ఉదయ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు 33/11 కెవి చొల్లంగి విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో జి.వేమవరం, చొల్లంగి, చొల్లంగి పేట, పటవల, కొత్తూరు, రామన్నపాలెం, మట్లపాలెంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

పట్టణంలో స్పెషల్ శానిటేషన్ పనులు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలో గురువారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా దోమలు ప్రబలకుండా పాపయ్య చావిడి ఎస్‌సి పేట ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో దోమల మందు స్ప్రే చేశారు. ఈ శానిటేషన్ పనులను కమిషనర్ పి.శ్రీనివాసులు, శానిటేషన్ అధికారి రఘు ప్రసాద్, సెక్రటరీలు పర్యవేక్షించారు.

577 రవాణా కేసుల నమోదు

ప్రజాశక్తి-రౌతులపూడి

2025 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు వాహనాలపై 577 కేసులు నమోదు చేసి రూ.68 లక్షలు జరిమానా విధించినట్టు కత్తిపూడి ఎంవిఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. రౌతులపూడి నుంచి రవాణా చేసే నల్లరాయి, చింతలూరు నుంచి రవాణా చేసే ఎర్రమట్టి లారీలపై అధిక లోడు, భద్రతా ప్రమాణాలు పాటించని లారీలపై ఇప్పటి వరకూ 116 కేసులు నమోదు చేసి రూ.16 లక్షలు జరిమానా విధించినట్టు తెలిపారు. ఈ తనిఖీలు ఇక నిరంతరం కొనసాగుతాయని, వాహనాదారులు భద్రతా నియమాలు పాటించాలని హెచ్చరించారు.

30న పెద్దాపురం మండల సమావేశం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఈ నెల 30వ తేదీ ఉదయం 10:30 గంటలకు పెద్దాపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపిడిఒ కెవి.సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడు పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని 23 గ్రామాల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనుల గురించి చర్చ సాగుతోందన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపిలు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీల కార్యదర్శి లు సకాలంలో హాజరు కావాలని కోరారు.


దళిత వికలాంగ సర్పంచ్‌పై వేధింపులు

ప్రజాశక్తి-కోటనందూరు

దళిత వికలాంగుడనైన తనను పోలీసులు మైనింగ్ అధికారులు వేధిస్తున్నారని భీమవరపుకోట సర్పంచ్ జగటాల వీరబాబు అన్నారు. గురువారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 14న తన సొంత అసైన్డ్ భూమిలో ఎత్తు పల్లాలను చదును చేస్తుండగా కొంతమంది రాజకీయ కక్షతో పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. వారు పొలంలోనికి వచ్చి పొక్లెయిన్, ఖాళీ ట్రాక్టర్లను తీసుకుని వెళ్లిపోయారనాన్రు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అడగ్గా తనపై దురుసుగా ప్రవర్తించారన్నారు. జిల్లా మైనింగ్ అధికారులను కలవగా ఎడి కార్యాలయానికి వెళ్లాలని సూచించారు. ఇలా 14 రోజుల నుంచి కార్యాలయాలు చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తారు. మైనింగ్ సిబ్బంది స్థలానికి వచ్చి పరిశీలించారని, సొంత భూమిలో చదును చేసుకోవడానికి ఎటువంటి అనుమతులూ అవసరం లేదని వెళ్ళిపోయారన్నారు. 14 రోజులు గడిచిన తర్వాత వాహనాలను విడిచి పెట్టాలని అధికారులు తెలిపారని సర్పంచ్ చెప్పారు. వాటికి అద్దె చెల్లించడానికి ఆర్థిక స్తోమత లేదని, తనకు న్యాయం చేయాలని ఆయన కోరారు.


మాట్లాడుతున్న సర్పంచ్ వీరబాబు

కార్టూ'నిజం'



గోదావరి పైపులైన్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సామర్లకోట

గోదావరి రక్షిత జలాలను గ్రామాల్లో ఇంటింటికీ చేరవేసే లక్ష్యంతో భారీ పైపులైన్ ప్రాజెక్టు పనులు చేపట్టినట్టు పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, బిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. పనసపాడులో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.1,650 కోట్లతో చేపట్టనున్న పైప్‌లైన్ నిర్మాణ పనులకు గురువారం ఎంఎల్ఎ చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, రూరల్ వాటర్ సప్లై ఆధ్వర్యంలో ధవళేశ్వరం నుంచి సామర్లకోట సహా పరిసర గ్రామాలకు స్వచ్ఛమైన గోదావరి నీరు అందించేందుకు ప్రభుత్వం కీలక కార్యక్రమం చేపట్టింది. మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పైపులైన్ ఏర్పాటు, ఇతర నిర్మాణ పనులను చేపట్టనుందన్నారు. రెండేళ్లలోగా మొత్తం పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికీ గోదావరి రక్షిత నీరు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. ధవలేశ్వరం వద్ద ప్రాజెక్టుకు చెందిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించి అక్కడ నుంచి నేరుగా ఫిల్టర్ జలాలను గ్రామాలకు అనుసంధానం చేస్తూ పైప్ లైన్ల ద్వారా పంపనుందన్నారు. మండలంలోని ఉండూరు, పెదబ్రహ్మదేవం గ్రామాల వద్ద గోదావరి జలాల పైప్ లైన్ల ఇన్‌లెట్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల వెంకటేష్, కూటమి నాయకులు విత్తనాల వెంకటరమణ, నూనె రామారావు, అందుగుల జార్జి చక్రవర్తి, టిడిపి మండల అధ్యక్షుడు ముసిరెడ్డి శ్రీరాములు, డిఇ ఎన్ఎస్.స్వామి, ఎఇ సుభాషిణి, ఉండూరు సొసైటీ అధ్యక్షుడు బచ్చుల జెమ్మి పాల్గొన్నారు.


పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప


గిరిబాబుకు కోటి సంతకాల పత్రాలను అందిస్తున్న పార్టీ నాయకులు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ దుర్మార్గం

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తే పేద విద్యార్థులకు నష్టం వాటిల్లుతుందని వైసిపి కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. మండలంలో ఉత్తరకంచి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు కోటి సంతకాల కార్యక్రమాన్ని పూర్తి చేసి కోటి సంతకాల పత్రాలను ముద్రగడ గిరిబాబుకు అందజేశారు. గిరిబాబు మాట్లాడుతూ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రజలు మహిళలు విద్యార్థులు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేయడం అభినందనీయం అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని గిరిబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ల కాంతి సుధాకర్, మండల కన్వీనర్ రామిశెట్టి నాని, గొల్లపల్లి దొరబాబు, బొడ్డు చిన్నా పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

యువతి అదృశ్యంపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని చేబ్రోలు ఒక ప్రైవేటు కాలేజీలో కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం చెందిన త్రిపుర సాయి తులసి బుధవారం పరీక్ష రాసేందుకు ఇంటి నుంచి కాలేజీకి వచ్చింది. పరీక్ష అనంతరం ఇంటికి రాలేదు. దీంతో యువతి తల్లి మహాలక్ష్మి ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

అత్యాచార యత్నం కేసులో ఏడేళ్ల జైలు

ప్రజాశక్తి -కరప

వేళంగి గ్రామంలో 2024లో వద్దురాలిపై అత్యాచారం చేసేందుకు ప్రయత్నించిన కేసులో నేరం రుజువు కావడంతో జడ్జి దోషికి ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ టి.సునీత తెలిపారు. 80 ఏళ్ల వద్ధురాలిపై నొక్కు వెంకటరమణ అత్యాచార యత్నం చేశారు. దీనిపై అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అతడిపై నేరం రుజువు కావడంతో రాజమహేంద్రవరం కోర్టులో జడ్జి వై.బెన్నయ్య నాయుడు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎజిఎం, ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు శ్రీచైతన్య విద్యార్థులు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి జూడో, వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు ఎగ్జిక్యూటివ్ ఎజిఎం ఎంవి.సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్ 14 వాలీబాల్ పోటీలకు 8వ తరగతి విద్యార్థి ఎస్.సూర్య చరణ్ ఎంపికైనట్టు తెలిపారు. అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి జూడో పోటీలకు సిహెచ్.జ్యోష్టిక, జె.రేవంత్, అభి, బెంజిమెన్ రాజు ఎంపికయ్యన్నారు. వారిని ఎంజిఎంతో పాటు అర్ఐ పి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ జి.శ్రీనివాసరావు అభినందించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

ప్రజాశక్తి-పిఠాపురం

ప్రముఖ ఫైనాన్స్ సంస్థ ఐఐఎఫ్ఎల్ పిఠాపురం బ్రాంచ్ ఆధ్వర్యంలో స్థానిక అగ్రహారంలోని సిబిఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డిఎం రౌతు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. తమ ఐఐఎఫ్ఎల్ సంస్థ ద్వారా చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాల్లో భాగంగా బ్రాంచ్ నుంచి స్థానిక అగ్రహారం మున్సిపల్ ప్రైమరీ పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐఎఫ్ఎల్ సంస్థ బిఎం నక్క నాగభూషణం, ఆశిష్, శంకర్, బాలరాజు, సామాజిక సేవ కార్యకర్త నల్లమిల్లి అర్పణ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఎం.రమణ, సతీష్, పి.దుర్గా దేవి, అశ్వినీ దేవి, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



రాపాకలో మహిళలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దివ్య

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

ప్రజాశక్తి-కోటనందూరు

రాజకీయ పార్టీల కతీతంగా ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నామని ప్రభుత్వ విప్, తుని ఎంఎల్ఎ యనమల దివ్య అన్నారు. గురువారం తుని రూరల్ రాపాక, తొండంగి మండలం ఆనూరులో ఎంఎల్ఎ దివ్య విస్తతంగా పర్యటించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని రైతులకు సూచించారు. మహిళలతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో యనమల రాజేష్, చింతమనేడు అబ్బాయి, కొయ్యా శ్రీను, కోడా వెంకటరమణ, అరిగెల నర్సింహమూర్తి, బడే మంగ, ఊటకుట్టి శ్రీధర్, నరిశే వీరాస్వామి, జాగు గోవిందు, అప్పలరాజు, నక్కా శేషగిరి, ఊటకూటి ఈశ్వరరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి యుటిఎఫ్ చేయూత

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల కేంద్రం ఆత్రేయపురం దళిత చిన పేటలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం వల్ల పమ్మి శాంతకుమారి తాటాకిల్లు దగ్ధమయ్యింది. దీంతో వారు నిరాశ్రయులయ్యారు. గురువారం మండల యుటిఎఫ్ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతి బసు ఆధ్వర్యంలో యుటిఎఫ్ లక్ష్యాలలో ఒకటైన సామాజిక స్పృహలో భాగంగా చేయూత అందించింది. బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు, కూర గాయలు, వంటసామగ్రి, దుప్పట్లు మొదల గునవి రూ.2500 విలువచేసే సామగ్రిని మండల శాఖ పంపిణీ చేసింది. ఎస్ వివిఎన్ఎస్.ప్రసాద్, అధ్యక్షులు టి.రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుధాకర్ బాబు, కోశాధికారి కడలి ప్రసాద్, ఆఫీస్ బ్యారర్లు కందుల గోవిందరావు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో ప్రజా దర్బార్‌ను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ బికెఎస్ ఎస్.వెంకట్ రామన్ తెలిపారు. ఆయన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

చిరు వ్యాపారులకు ఉద్యమ ఆధార్ ఉండాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారాలు ఉన్నవారు తప్పనిసరిగా ఉద్యమ ఆధార్ చేయించుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ డిఆర్‌పిలు సూర్య, పవన్ సూచించారు. గురువారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయం వద్ద విఒఎలు, డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఉద్యమ ఆధార్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ ఉద్యమ ఆధార్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారికి ఆధార్ కార్డు వలె ఒక నెంబర్ వస్తుందన్నారు. ఆ నెంబర్ ద్వారా ప్రభుత్వ పథకాలు అందుకోవచ్చున్నారు. చిన్న వ్యాపారాలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిఆర్‌డిఎ ఎపిఎం విజయలక్ష్మి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఉమా మహేశ్వరరావు, నాన్ ఫామ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

విద్యార్థి దశ చాలా కీలకమైనదని, చెడు వ్యసనాలకు బానిస కాకూడదని రూరల్ సిఐ చైతన్య కృష్ణ పేర్కొన్నారు. రూరల్ మండలం ఇంద్రపాలెంలో మౌంట్ కార్మెల్ స్కూల్ ఎండి సాయిరాం నానిశెట్టి ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్ బాడ్ టచ్, సైబర్ క్రైమ్‌పై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సిఐ చైతన్యకృష్ణ, ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లతో ఆడుతూ పెద్ద మొత్తంలో నగదు కోల్పోతున్నారని, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి వాటి వల్ల విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. చిన్న వయసులోనే విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తుని నాశనం చేసుకుంటున్నారని వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బిహెచ్.కృష్ణవేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిని అశ్రద్ధ చేయరాదు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

ఆధునిక జీవన విధానం, ఆహారపు అలవాట్లు, పౌష్టికాహార లోపం వంటి కారణాల వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోందని, దీన్ని అశ్రద్ధ చేయరాదని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు పేర్కొన్నారు. స్థానిక బోటు క్లబ్బు ఉద్యానవనంలో లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో 'మధుమేహం-జాగ్రత్తలు'పై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తంలోని గ్లూకోజ్‌ను క్రమపరిచే ఇన్సులిన్ సరిగా వినియోగించకపోవడంతో మధుమేహ వ్యాధి వస్తుందన్నారు ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే అంధత్వం, మానసిక సమస్యలు, గుండెపోటు, మూత్రపిండాల వైఫల్యం వంటి సమస్యలు వేధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నాగేంద్ర గాంధీ, అడబాల రత్న ప్రసాద్, డాక్టర్ దాసరి శ్రీధర్ బుద్ధరాజు సత్యనారాయణ రాజు, న్యాయవాది యనమల రామ, పి.ధర్మచంద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో కడుపు కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-కాకినాడ



డాక్టర్ మురళీధర్

స్థానిక అచ్చంపేట జంక్షన్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో కడుపు కేన్సర్‌పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కేన్సర్ చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ కడుపు కేన్సర్‌ను గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారన్నారు. ఇది కడుపు గోడల్లో చెడు కణాలు ఏర్పడినప్పుడు కలిగే తీవ్రమైన వ్యాధి అని, ప్రారంభ దశల్లో ఎక్కువగా లక్షణాలు కనిపించకపోవడం వల్ల చాలా సందర్భాల్లో దాన్ని గుర్తించడం ఆలస్యం అవుతుందన్నారు. ఈ కేన్సర్ సంభవించే కారణాల్లో దీర్ఘకాలిక గాస్ట్రైటిస్, హెలికోబాక్టర్ ఫైలోరి అనే బ్యాక్టీరియా సోకడం, ధూమపానం, కొన్ని ఆహారపు అలవాట్లు, కుటుంబ సభ్యుల్లో కడుపు కేన్సర్ ఉండటం ముఖ్యమైనవిగా భావించాలని తెలిపారు. ప్రారంభ దశలోనే వీటిని గుర్తించడం అత్యంత అవసరం అన్నారు. అది చికిత్స విజయవంతంగా సాగేందుకు సులభతరం చేస్తుందని తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవు

ప్రజాశక్తి-గొల్లప్రోలు

అనుమతి లేని భవనాల ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ పి.శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలు, ప్లాన్లపై టౌన్ ప్లానింగ్ అధికారులతో కమిషనర్ పి.శ్రీనివాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2025 ఆగస్టు కంటే ముందు అనుమతి ఇచ్చిన ప్లాన్లకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపట్టిన భవనాలకు బిపిఎస్ దరఖాస్తులు తప్పనిసరిగా సమర్పించాలని, అనధికార లేఔట్లలో ఉన్న ప్లాట్లను తప్పనిసరిగా క్రమబద్ధీకరించుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని తెలిపారు. ఈ సమావేశంలో మేనేజర్ నవీన్ చంద్ర, పట్టణ టౌన్ ప్లానింగ్ అధికారిని నీలిమా దీప్తి సిబ్బంది పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ పోటీల్లో కమలకు రజతం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ విద్యార్థిని దాడి కమల వైష్ణవి రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో రజత పతకం సాధించిందని స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా తరుపున నిర్వహించిన జిల్లాస్థాయి బాస్కెట్ బాల్ క్రీడా క్రీడాకారుల ఎంపిక పోటీలో వైష్ణవి పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొనేందుకు ఎంపికయ్యిందన్నారు. ఈ నెల 24 నుంచి 26 వరకూ మూడు రోజుల పాటు చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరిగిన 69వ ఎస్‌జిఎఫ్ఐ అంతర్ జిల్లాల అండర్-14 బాలికల బాస్కెట్‌బాల్ పోటీలో ఈ జట్టు ద్వితీయ స్థానం సాధించిందన్నారు. ఈ సందర్భంగా కమల వైష్ణవిని, శిక్షణ ఇచ్చిన కోచ్‌లను స్కూల్ డైరెక్టర్ సిహెచ్.విజయప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవివిఎస్ మూర్తి, పాఠశాల అకాడమిక్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కో ఆర్డినేటర్ ఉషా చైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

భీమేశ్వర స్వామికి రూ.43.95 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో హుండీలను గురువారం లెక్కించారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 27 వరకు మొత్తం 43 రోజులకు ఆలయ హుండీల ద్వారా ఆదాయం రూ.43,95,359 లభించి ందని ఇఒ అల్లు వెంకట దుర్గాభవాని తెలిపారు. దీంతో పాటుగా అన్నదానం హుండీ ద్వారా మరో రూ.52,682 వచ్చినదని ఆమె తెలిపారు. లెక్కింపు కార్యక్రమం జిల్లా అసిస్టెంట్ కె.సత్యనారాయణ పర్యవేక్షించారు. ఓదూరు గ్రూప్ టెంపుల్స్ ఇఒ విత్తనాల శ్రీనివాస్ గంగవరం గ్రూప్ టెంపుల్స్ ఇఒ బాలకృష్ణ , ముప్పనపల్లి గణేష్, ఆళ్ల బుజ్జి, దవులూరి రామకృష్ణ,అల్లం రామకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-గండేపల్లి

ఇటీవల మరణించిన మల్లేపల్లి సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మి కుటుంబాన్ని పలువురు గురువారం పరామర్శించారు. జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ కో ఆర్డినేటర్ రామకుర్తి నరసింహ, బలిరెడ్డి గణేష్, రామకుర్తి మూర్తి, బొల్లంరెడ్డి రామకృష్ణ, బ్రహ్మాజీ, పులిప్రసాద్ పాల్గొన్నారు.

రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

యువత రాజకీయాల్లో అవగాహన పెంపొందించుకోవాలని ఎంఎల్ఎ వరుపుల సత్య ప్రభ అన్నారు. ఇటీవల విజయవాడలో పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్‌గా వ్యవహరించిన శంఖవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన సైపురెడ్డి స్వాతిని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అభినందించారు. మాక్ అసెంబ్లీ స్పీకర్‌గా ప్రతిభ కనబరిచి నియోజకవర్గానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన స్వాతిని అభినందిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బద్ది రామారావు, వెన్నా శివ, పర్వత సురేష్ పాల్గొన్నారు.

జనసేన పార్టీలో పలువురి చేరిక

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక 7వ వార్డు పరిధిలోని బ్రాహ్మణ సేవా సంఘం మహిళలు జోస్యుల పద్మావతి ఆధ్వర్యంలో గురువారం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన పార్టీ కండువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు పొలమరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక ఆంధ్ర కేసరి ప్రకాశం పురపాలక ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలను సందర్శించారు. వారు ఏ విధంగా అభివద్ధి చెందారో విద్యార్థులకు తెలియజేస్తూ వారిలో ప్రేరణ కలిగించారు. సిఐగా రిటైర్ అయిన షేక్ గణేష్ వలీ, అసిస్టెంట్ ఇంజనీర్‌గా రిటైరైన అల్లిబోయిన సత్యనారాయణ, కాంట్రాక్టర్, సామాజికవేత్త సోము సత్యనారాయణ, న్యాయవాది తటవర్తి సురేష్, గుబ్బల రాజు పాల్గొని విద్యార్థులకు స్వీయ అనుభవాలను వివరించారు. శ్రీకృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా హ్యాండ్ రైటింగ్ ప్రాక్టీస్ పుస్తకాలను సిసిఆర్‌టి ప్రసాద్ పాఠశాల హెచ్‌ఎం వాకపల్లి రాజు ద్వారా విద్యార్థులకు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లోవరాజు, కృష్ణార్జున, సునీత పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఆలమూరు

కూటమి ప్రభుత్వం అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తోందని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యా నందరావు అన్నారు. మండల పరిధిలోని సందిపూడిలో నూతన సచివాలయాన్ని గురువారం ఆయన స్థానిక నేతలతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నూతన కళ్యాణ మండప నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. అలాగే గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి నిధులు రూ.43.60 లక్షలు వ్యయం వెచ్చించి నూతన సచివాలయ భవనం నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పలు సంక్షేమ పథకాలు వివరించారు. పంచాయతీ ప్రజలు, రైతులు సచివాలయం సేవలను విని యోగించు కోవాలని అన్నారు. సచివాలయ అధికారులు ప్రజలకు నిత్యం అందు బాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు గృహ రుణాలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పురపాలక సంఘంలో పెండింగ్‌లో ఉన్న లబ్దిదారులకు టిడ్కో హౌసింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఈజీ హోమ్ లోన్స్ వారి ద్వారా రునాలు మంజూరు చేసేందుకు మెప్మా కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య పాల్గొని మాట్లాడుతూ సామర్లకోట పట్టణంలో రుణాలు మంజూరు కాకుండా 350 మంది లబ్ధిదారులు మిగిలి ఉన్నారన్నారు. వివిధ కారణాల వల్ల గతంలో వీరికి బ్యాంకు లోన్లు మంజూరు కాలేదని, ప్రస్తుతం వీరికి ఈజీ హోమ్ లోన్ వారిచే రుణాలు అందించేందుకు వారు ముందుకు వచ్చినట్టు చెప్పారు. ఇప్పటి వరకూ రుణాలు పొందని లబ్ధిదారులు ఈ నెల 27,28, 29 తేదీల్లో మెప్మా కార్యాలయంలో రుణాల మంజూరు కోసం సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో సేల్స్ మేనేజరు గాంధీ, టిడ్కో సిఎల్‌టిసి రత్న, మెప్మా సిఎంఎం సయ్యద్ హుస్సేన్, సిఒలు బి.వెంకట లక్ష్మి, వై.వెంకట లక్ష్మి, డి.అరుణ, టిఎల్ఎఫ్ ఆర్‌పి, ఎస్-ఎల్ఎఫ్ఆర్‌పిలు, టిడ్కో లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాల్య వివాహ ముక్త్ భారత్ ర్యాలీ

ప్రజాశక్తి - సామర్లకోట

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ట్రస్ట్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఆధ్వర్యాన చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాధవపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ, కొవ్వొత్తుల ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒ జి.ఉష, గ్రామ సర్పంచి ఎం.సుగుణమ్మ, ఎంపిటిసి జి.కృష్ణ, అర్జున రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఉష మాట్లాడుతూ నవంబర్ 27, 2024 నుంచి బాల్య వివాహ ముక్త భారత్ కార్యక్రమం ప్రారంభించినట్టు తెలిపారు. దేశంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కమ్యూనిటీ సోషల్ వర్కర్ బి.లక్ష్మి, సూపర్‌వైజర్ నళిని, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి- తాళ్లరేవు

లింగ ఆధారిత వివక్ష, బాలలు, మహిళా చట్టాలపై భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో నీలపల్లి జెడ్‌పి పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా మహిళా మండలి ఆధ్వర్యంలో జరుగుతున్న 16 రోజుల కార్యక్రమంలో భాగంగా 3వ రోజు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భీమాబాయి మహిళా మండలి సమన్వయకర్త ఆర్.లోవరాజు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న హింస, హక్కులు, చట్టాల పట్ల పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధితులు ప్రభుత్వ చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థి దశ నుంచే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు ఎన్.రాజమహేశ్వరి మాట్లాడుతూ ప్రతి మహిళా జీవన విధానాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. సమాజానికి చేటు తెచ్చే బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవి, వరలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

యానాం వార్తలు



విజేతలకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపల్ బాలరాజు స్వామి, శ్రీనివాస్

ఉత్సాహంగా బ్లాక్ లెవెల్ ఆటల పోటీలు

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో స్థానిక బిఆర్ అంబేద్కర్ కళాశాలలో బ్లాక్ లెవెల్ ఆటల పోటీలు గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి తిర్రి గోపి మాట్లాడుతూ విద్యార్థుల్లోనూ యువతలోనూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అథ్లెటిక్స్ కోచ్ పబ్బినీడి శేఖర్, నంద్యాల దుర్గారావు పర్యవేక్షించారు. వాలీబాల్, కబడ్డీ, పరుగు పందేల్లో యువతీ యువకులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ టిఎ.బాలరాజుస్వామి, పాలిటెక్నిక్ కళాశాల సూపరింటెండెంట్ రెయ్య శ్రీనివాస్, తిర్రి గోపి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిఎల్‌పి.రాజు, కనకాల తాతారావు, ఇతర అధ్యాపకులు ఎన్ఎస్ఎస్, మై భారత్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపుపై మల్లాడి సమీక్ష

ప్రజాశక్తి - యానాం

యానాం జాతీయ రహదారి 216 ఆనుకొని ఉన్న చిరు వ్యాపారుల దుకాణాలను ఎన్‌హెచ్ ఆఫీసర్లు పొక్లెయిన్, హైడ్రాలతో తొలగిస్తుండడంతో పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును బాధితులు ఆశ్రయించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో, ఆర్ఎఒ అంకిత్ కుమార్ సమక్షంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ జాతీయ రహదారి ఆనుకుని ఉన్న పలు దుకాణాలను పూర్తిగా తొలగించవలసి వచ్చినప్పుడు కచ్చితంగా తొలగించడానికి వ్యాపారులు సిద్ధంగా ఉన్నారని, అంతే గాని కేవలం యానాం వ్యాపారస్తులను మాత్రమే ఇబ్బంది పెడతానంటే ఊరుకోమని హెచ్చరించారు. అవసరమైతే రోడ్డుపై బైఠాయిస్తానన్నారు. ప్రస్తుతం వ్యాపారాలు చేసుకునేందుకు సమయం ఇవ్వాలని అధికారులను కోరారు.

తల్లిదండ్రులకు బాలుని అప్పగింత

ప్రజాశక్తి - యానాం

బీహార్ రాష్ట్రం రాజా నగర్ ప్రాంతానికి చెందిన సాధుసరం సాహు కుమారుడు ధరంజి కుమార్ ఈ నెల 26న స్థానిక గిరియంపేటలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా అవుట్ పోస్ట్ పోలీస్‌లు గుర్తించారు. ఆ బాలుని యానాం చైల్డ్ హెల్ప్ లైన్‌కు అప్పగించారు. అనంతరం చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది ఆ బాలుడి వివరాలు పూర్తిగా సేకరించి ఆర్ఎఒ అంకిత్ కుమార్, ఎస్ఐ పునీత్ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సమక్షంలో యువకుని వారి కుటుంబ సభ్యులకు గురువారం అప్పగించారు.

బిసి హక్కుల సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - యానాం

బిసి హక్కుల సాధనకు సమిష్టిగా కృషి చేయాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి, జాతీయ బిసి సంఘం నాయకుడు మల్లాడి కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక కామిశెట్టి వారి వీధిలోని గీతా మందిరంలో ఎపి బిసి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాడి మాట్లాడుతూ వెనుకబడిన సామాజిక వర్గాలంతా ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం పలు అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిసి ప్రతినిధులు జస్టిస్ ఈశ్వరయ్య, డాక్టర్ విశారధ మహారాజ్ (తెలంగాణ), కుడిపూడి సూర్యనారాయణ, రెడ్డి సుబ్రమణ్యం, పితాని బాలకృష్ణతో పాటు ఉభయ గోదావరి జిల్లాల ముఖ్య బిసి నాయకులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి-పిఠాపురం



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన పిఠాపురం నియోజకవర్గంలో నాబార్డ్ ద్వారా మంజూరైన పలు రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణాన్ని గాలికి వదిలేయడం వల్ల ప్రజలు చాలా కష్టాలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా రహదారుల మరమ్మత్తులు చేపట్టంతోపాటు అవసరమైన చోట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల నుంచి రహదారులు నిర్మించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివద్ధి చేయాలనే సంకల్పంతో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజవర్గానికి అధిక మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

బాధితునికి రమణారావు రూ.10 వేల సాయం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

చల్లపల్లి యెరుబండిచెరువుకు చెందిన మాజీ ఎంపిటిసి సభ్యుడు బీర ధనుంజయరావు అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుం టున్నాడు. ధనుంజయరావును గురువారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శిం చారు. బాధితుని వైద్యం నిమిత్తం రూ.10వేల చెక్కును రమణారావు అందజేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రమణారావుకు ధనంజయరావు, ఆయన కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, నాయకులు బీర రమేష్,పరమట పండు, కాట్రు మధు, సాధ నాల శ్రీను,నక్కా సంపత్ కుమార్, నేరేడుమిల్లి శ్రీను, గంటా లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.